సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 25 । జనవరి । 2023



ధ్వజ స్తంభ దీప కలశం మాయం

పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఏనుగుమల్లమ్మ ఆలయం ఎదుట ప్రతిష్టించిన అత్యంత పురాతనమైన ధ్వజస్తంభంపై ఉన్న దీప కలశం మాయమైంది. - 8లో



గురుకుల పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ

వాల్మీకిపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ చేపట్టింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.230
రెండోరకం	రూ.90	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 162 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఫిబ్రవరి 15వరకు డీఎడ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు

రాయచోటిటౌన్ : డీఎడ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఫిబ్రవరి 15వరకు గడువు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2015–2017 నుంచి 2018–2020 వరకు ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన వారు రూ.100, రెండు సబ్జెక్టులకు రూ.120, మూడు సబ్జెక్టులకు రూ. 140, ఆరు సబ్జెక్టులకు రూ.150 చెల్లించాలన్నారు.

బాలికల పరిరక్షణ అందరి బాధ్యత

– జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా


రాయచోటి అర్బన్ : బాలికల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద బాలికాదినోత్సవ ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికా సంరక్షణతో పాటు సాధికారత కల్పించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా బాలికలకు కల్పించిన హక్కులను గౌరవించాలని సూచించారు. భ్రూణహత్యల నిరోధాన్ని సామాజిక బాధ్యతగా తీసుకుని వ్యతిరేకించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో బాలబాలికల మధ్య తేడాలు చూపకూడదన్నారు. చిన్నతనం నుంచే బాలికలకు అవకాశాలు కల్పించినప్పుడే సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుందన్నారు. ఆడపిల్లలకు ప్రభుత్వపరంగా పలురకాల ప్రోత్సాహకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ర్యాలీలో డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, డెమో మీడియా అధికారిణి దేవశిరోమణి తదితరులు పాల్గొన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 30వ తేదీ ఉదయం 9.00 గంటలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3వ తేది సర్వసభ్య సమావేశం జరపాలని తొలుత నిర్ణయించామన్నారు. అయితే పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈనెల 31 నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. దీంతో ఎంపీలు జెడ్పీ సమావేశానికి హాజరు కాలేని పరిస్థితి ఏర్పడడంతో ఈనెల 30న సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

కరువు తీరా ఎరువులు

- రబీకి పుష్కలంగా నిల్వలు
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ
- అన్నదాతకు ప్రభుత్వం భరోసా



రబీ సీజన్‌లో పంటల సాగుకు పొలాన్ని సేద్యం చేస్తున్న రైతు

సాక్షి,రాయచోటి : రబీ సీజన్ మొదలైందంటే చాలు గతంలో రైతులు ఎరువుల కోసం పడిన బాధలు అన్నీ ఇన్నీ కావు. ఉదయం లేచింది మొదలు ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాసేవారు. క్యూలైన్లలో నిలబడి తమవంతు వచ్చి ఓ బస్తా ఎరువు దొరికిందంటే వారి సంతోషానికి హద్దు ఉండేది కాదు. కొందరు సాగుకు కొన్ని మాసాల ముందే అధిక వడ్డీలకు అప్పు చేసి ఎరువులు కొని ఇళ్లలో దాచుకునేవారు. ఇప్పుడు అలా కాదు.. జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి అన్నదాతలకు మంచి రోజులు వచ్చాయి. రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తకుండా సీజన్ ఏదైనా సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. ఈ సీజన్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఇప్పటికే ఆర్‌బీకేలలో సిద్ధంగా ఉంచింది. వర్షాలు కురవకపోయినా చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే సాగు విస్తీర్ణం అంచనాకు అనుగుణంగా విత్తనాలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ తాజాగా ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టింది. ఈ ఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 68,729 హెక్టార్లు కాగా, ఇప్పటివరకు 32,721 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈనెలాఖరు నాటికి మిగిలిన పంటలు సాగు కానున్నాయి. ఇందుకు అనుగుణంగా అవసరమైన యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే, ఎస్‌ఎస్‌పీలతోపాటు అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులనూ అందుబాటులో ఉంచింది. రబీ సీజన్ ముగిసే వరకు జిల్లాకు 42,401 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని కంపెనీల వారీగా వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించగా జిల్లాలో ప్రస్తుతం (జనవరి నెల) 9746 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికి 3581 మెట్రిక్ టన్నుల ఎరువులు అమ్మకాలు జరిగాయి. ఇందులో 30 మండలాల పరిధిలో ఉన్న 400 ఆర్‌బీకేలలో 1800 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అవసరమైన మేరకు ఆర్‌బీకేలకు పంపిణీ చేసేందుకు మార్క్‌ఫెడ్ జిల్లాలోని గోదాములలో ఎరువులను సిద్ధంగా ఉంచింది. ఈ రబీ సీజన్లలో సాగు విస్తీర్ణం సాధారణ సాగు విస్తీర్ణం కన్నా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ, జొన్న, వరి, మొక్క జొన్నలతోపాటు అరటి, మిరప, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

కల్తీలకు కళ్లెం..

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేవారు. తీరా దిగుబడి చేతికొచ్చే సమయానికి చేదు అనుభవం ఎదురవుతోంది. లోతుగా ఆరా తీస్తే కల్తీ, నాసిరకమైనవని నిర్ధారణ అయ్యేది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోవడంతో అన్నదాతలు కోలుకోలేకపోయేవారు. ఇలాంటి సమస్యలకు ఆదిలోనే చెక్ పెట్టాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లాలో 400 ఆర్‌బీకేలను అందుబాటులోకి తెచ్చి విత్తనం నుంచి ఎరువుల వరకు ఇక్కడి నుంచే పొందే అవకాశం కల్పించింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో ప్రధాన పంటల సాగు వివరాలు

పంట	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	ప్రస్తుతం సాగైన పంటలు (హెక్టార్లలో)
వేరుశనగ	21,273	23,154
వరి	18,587	1657
ఇతర పంటలు	28,869	7910

ఆర్‌బీకేలలో జనవరి నెలకు సంబంధించి నిల్వ ఉన్న ఎరువుల వివరాలు

ఎరువు రకం	రబీ సీజన్‌కు కేటాయించిన ఎరువులు	ఇప్పటికే కొనుగోలుచేసిన ఎరువులు	ఆర్‌బీకేలలో నిల్వ ఉన్న ఎరువులు
యూరియా	18750	1484	3518
డీఏపీ	4395	428	1331
ఎంఓపీ	2133	116	575
ఎన్‌పీకే	14138	1302	3578
ఎస్‌ఎస్‌పీ	2982	251	744

రెండున్నర ఎకరాలో వేరుశనగ సాగు



ఈ ఏడాది రబీ సీజన్‌లో రెండున్నర ఎకరా పొలంలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నాను. ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బంది లేదు. రసాయన ఎరువులను కూడా ఆర్‌బీకేలలో తెచ్చుకున్నాను.

– నరసింహారెడ్డి(గంగిరెడ్డిపల్లె రైతు), సుండుపల్లె మండలం, అన్నమయ్య జిల్లా

ఆర్‌బీకేలకు అధిక ప్రాధాన్యత



ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నాం. ఆర్‌బీకేలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అందుబాటులో ఉంచాం. మండలాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎరువులు కొరత లేకుండా ఆర్‌బీకేలో ఎరువులు నిల్వ ఉంచుతున్నాం. అందుబాటులో ఉన్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఉమా మహేశ్వరమ్మ (జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి), అన్నమయ్య జిల్లా

పుష్కలంగా ఎరువులు



విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నాం. రైతులకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా సీజన్ ఏదైనా సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. ఈ సీజన్‌కు కావాల్సిన ఎరువులు ఇప్పటికే ఆర్‌బీకేలలో సిద్ధంగా ఉంచాం. కోటా మేరకు ఎరువుల సరఫరా జరిగేలా కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, మార్క్‌ఫెడ్ అధికారులతో తరచూ సమీక్షిస్తున్నాం. ఇంతవరకు జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత అనేదే లేదు.

– గిరీషా పీఎస్(జిల్లా కలెక్టర్), అన్నమయ్య జిల్లా

సింహ వాహనంపై నరసింహుడు

– వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చిన్న శేష వాహనంపై కడప రాయుడు మాడవీధుల్లో విహరించారు. ఉదయం వాహన సేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం సేవ నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో కనుల విందుగా ఏర్పాటు చేసిన ఊయలపై స్వామిని సేద దీర్చారు. అనంతరం సింహంపై నరసింహుడు కడప రాయుడు మలయప్పగా కొలువుదీరి భక్తులను కరుణించాడు. కోలాటాలు, భజన బృందాలు, మంగళ వాయిద్యాలు ముందు నడుస్తూ స్వామిని స్వాగతిస్తుండగా, భక్తుల గోవిందనామ స్మరణల మధ్య మాడవీధులలో ఆనంద విహారం చేశారు. స్వామికి పూజా ద్రవ్యాలు సమర్పించి భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామి తిరుమాడవీధులలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఉదయం 10.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6.00 గంటలకు ఊంజల సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల కీర్తనల ఆలాపనలు, రాత్రి 8.00 గంటల నుంచి స్వామిని హనుమంత వాహనంపై ఊరేగించనున్నారు.

గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి



ట్రోఫీ అందుకుంటున్న బాలికల విభాగంలో విన్నర్స్ శ్రీకాకుళం జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న బాలుర విభాగంలో విన్నర్స్ విశాఖపట్టణం జిల్లా జట్టు

- డీవైఈఓ క్రిష్ణప్ప
- ఎస్‌జీఎఫ్ బాల్ బాడ్మింటన్ రాష్ట్ర జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. మంగళవారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాల, బాలికల అంతర్ జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు మెమెంటోలను అందజేశారు. డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. అందరూ కలిసి మెలిసి ఆడటం వల్ల స్నేహం కూడా పెరుగుతుందన్నారు. విజయం సాధించిన జట్లు జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వసంత, రామ, జిల్లా బాల్‌బాడ్మింటన్ చైర్మన్ రాఘవరెడ్డి, పీడీలు దేవకమ్మ, అన్సర్, వాసుదేవరెడ్డి, జీఆర్టీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మారాణి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాల్‌బాడ్మింటన్ బాల, బాలికల జట్ల విజేతలను వసంత ప్రకటించారు. అండర్–17 బాలికల విభాగంలో విన్నర్స్‌గా శ్రీకాకుళం, రన్నర్స్‌గా గుంటూరు, తృతీయ స్థానంలో కృష్ణాజిల్లా జట్లు నిలిచినట్లు తెలిపారు. అలాగే బాలుర విభాగంలో విన్నర్స్‌గా విశాఖపట్టణం, రన్నర్స్‌గా శ్రీకాకుళం, మూడవ స్థానంలో ప్రకాశం జిల్లా నిలిచినట్లు తెలిపారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

బాలికల వసతి గృహాలపై పర్యవేక్షణ తప్పనిసరి

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : బాలికల వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. వసతి గృహాలలో పనిచేసే అధికారులు, సిబ్బంది విద్యార్థినులను సొంత బిడ్డల్లా చూసుకొని వారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి కలెక్టర్ గిరీషా పీఎస్ వసతి గృహాలలోని బాలికల సంక్షేమంపై ఎంఈఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మెడికల్ ఆఫీసర్లు, సీడీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో 54 బాలికల వసతి గృహాలు ఉన్నాయన్నారు. వసతి గృహాలలో 80 శాతం పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు విద్యను అభ్యసిస్తుంటారన్నారు. వీరికి విద్యా బోధన చేసే ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిని తమ కుమార్తెలా భావించి క్రమ శిక్షణతో కూడిన మంచి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో ఉన్న విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ మానిటరింగ్ కమిటీ సభ్యులను నియమిస్తామన్నారు. వీరు నెలకు రెండుసార్లు 2వ, 4వ గురువారాలలో పాఠశాలలు, వసతి గృహాలలో ఉండే విద్యార్థినులతో సంప్రదించి వారి సమస్యలు గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థినులలో భయాన్ని పోగొట్టి ధైర్యంగా తమ సమస్యలు చెప్పే విధంగా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు వసతి గృహాలను తరచూ సందర్శించాల్సి ఉంటుందన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్ హుస్సేన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను ఎస్పీ, జేసీలతో కలసి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణాశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై వివిధ శాఖాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, రవాణ శాఖ పక్కా ప్రణాళికతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు సహాయం చేసిన వ్యక్తులకు గుడ్ సమార్టిన్ పథకం కింద రూ. 5 వేలు నగదు పురస్కారం అందిస్తారని, దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాలో 2022లో మొత్తం 727 ప్రమాదాలు జరగ్గా అందులో 293 మంది మరణించారన్నారు. 846 మందికి గాయాలయ్యాయన్నారు. ఇందులో ప్రమాదాల వారిగా చూస్తే ఆర్టీసీ బస్సు వల్ల 45 ప్రమాదాలు, ప్రైవేటు బస్సు వల్ల 13, లారీలు 97, లైట్ మోటార్ వెహికల్స్ 190, ద్విచక్ర వాహనాలు 234, మూడు చక్రాల వాహనాలు 75, ఇతర వాహనాల వల్ల 73 ప్రమాదాలు జరిగాయన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం : జిల్లా ఎస్పీ

హెల్మెట్ రక్షణ కవచమని, ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు. జిల్లాలో జరిగే రోడ్డు ప్రమాదాలలో సగం ప్రమాదాలు ద్విచక్ర వాహన ప్రమాదాలే ఉండగా అధికశాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరుగుతున్నాయన్నారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఆర్టీసీ, ఆర్అండ్‌బి జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్ల పరిశీలన

భారత గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లను చూడముచ్చటగా చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో భారత గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియాలతో కలిసి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. భారత గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రౌండ్‌ను, వేదికను అధికారులు చక్కని అలంకరణతో సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. శాఖల ప్రగతిని చూపే శకటాల వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మునిసిపల్ కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.

గూడుకు ఆదరువు!

- జిల్లాకు 77,161 పక్కా గృహాలు మంజూరు
- 10,433 గృహ నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో మిగిలిన ఇళ్లు
- లబ్ధిదారులకు రూ.435.14 కోట్లు బిల్లులు చెల్లింపు



బి.కొత్తకోట మండలం గట్టులో పూర్తయిన ఇంటి వద్ద లబ్ధిదారు సహదాబీబీ

బి.కొత్తకోట : పేదలకు పక్కా గృహాల నిర్మాణం కోసం గత ప్రభుత్వాలకు భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇళ్ల మంజూరు, స్థలాల కేటాయింపు, లబ్ధిదారులు నిర్మాణాలు మొదలు పెట్టి పూర్తయ్యే వరకు చేయూత అందిస్తోంది. నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులు చెల్లిస్తూ..నాణ్యమైన గృహ నిర్మాణ సామగ్రిని అందిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగంగా చేపట్టారు. గత ప్రభుత్వాలకు పూర్తి భిన్నంగా పారదర్శకంగా నిర్మాణాలు, బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. జిల్లాలో 77,161 మంది పేదలకు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలను కేటాయించారు. వీటిలో 1,021 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. బుధవారం నాటికి 10,433 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. బిలో బేస్‌మెంట్ లెవెల్ (బీబీఎల్) స్థాయిలో 23,831 గృహాలు, బేస్‌మెంట్‌లెవెల్ (బీఎల్) స్థాయిలో 21,270, రూఫ్ లెవెల్ (ఆర్ఎల్)స్థాయిలో 7,119, రూఫ్ కాస్ట్ (ఆర్సీ) స్థాయిలో 7,368 గృహాల నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటిదాకా జరిగిన ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.435.14 కోట్ల బిల్లులను ఖాతాలకు జమ చేసింది. ఇవికాక నిర్మాణాలకు అవసరమైన నాణ్యమైన ఒక్కో లబ్ధిదారునికి కిటికీలు, తలుపులు, డోర్ ఫ్రేమ్, షట్టర్, శానిటరీ మెటీయల్, వాటర్ సప్లయ్, ఎలక్ట్రికల్ మెటీరియల్, వాటర్ ట్యాంకు, రేకులు, జీఏ యాంగిల్స్‌లను, 90 బస్తాల సిమెంట్‌ను అధికారుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేయిస్తోంది. నిర్మాణ సామగ్రి కోసం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలుచేసి, తరలింపునకు ఇబ్బందులు తొలగించింది. తక్కువ ధరకే నాణ్యమైన సిమెంట్, మెటీరియల్‌ను అందిస్తోంది.

అదనంగా రూ.160 కోట్లు..

ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తోంది. ఇదికాకుండా నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా అదనంగా లబ్ధిదారులకు నిధులు అందిస్తోంది. జిల్లాకు 77,161 పక్కా గృహాలు మంజూరవ్వగా అన్ని స్థలాలను మహిళల పేరుతో ప్రభుత్వం కేటాయించింది. మహిళలందరూ మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండటంతో వారికి అదనంగా రుణం అందిస్తోంది. సంఘాలు, వీవో, స్త్రీనిధి, బ్యాంకు తదితర వాటి నుంచి ఒక్కో మహిళకు రూ.35వేల రుణం ఇస్తున్నారు. ఈ రుణాన్ని ఇంటి నిర్మాణ పనులకు ఖర్చు చేయాలి. జిల్లాలో 45,945 మంది మహిళలకు ఇప్పటి వరకు రూ.160.80 కోట్లు చెల్లించారు. మహిళలు అందరికీ ఈ రుణం అందిస్తున్నారు.

ఉగాదికి 20,690 ఇళ్లు సిద్ధం

వచ్చే ఉగాది నాటికి జిల్లాలో కొత్తగా 20,690 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈనెల 17 నాటికి 10,433 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించేలా కలెక్టర్ చర్యలు చేపట్టారు. మండలాల్లో ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో లబ్ధిదారులను సంప్రదిస్తూ నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశాలిచ్చారు. దీనిపై ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ లక్ష్యాల పూర్తికి కృషి చేస్తున్నాం.

– ఎస్.శివయ్య, జిల్లా గృహనిర్మాణ అధికారి, రాయచోటి

గతానికి భిన్నంగా..

గత ప్రభుత్వాల్లో గృహ నిర్మాణ బిల్లులు పొందాలంటే ఎదురుచూడాల్సి వచ్చేది. నిర్మాణ సామగ్రి ఇచ్చేవారు కాదు. ఇసుకనూ కొనుగోలు చేయాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా పేద లబ్ధిదారులకు అండగా నిలుస్తోంది. ఇంటినిర్మాణ స్థాయి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాగానే బిల్లుల మంజూరులో జాప్యం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అవుతున్నాయి. దీనికితోడు మహిళా సంఘాలు, బ్యాంకుల నుంచి ఇంటి నిర్మాణాల కోసం అదనంగా నగదు మంజూరు చేయిస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉంచేశారు. లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల తాజా స్థితి

నియోజకవర్గం	ఇళ్లసంఖ్య	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్సీ	పూర్తి
రాయచోటి	19,064	6,917	5,827	1,399	1,582	2,186
పీలేరు	12,333	1,698	3,660	1,368	1,612	2,062
రాజంపేట	11,674	4,389	2,934	778	988	930
రైల్వేకోడూరు	7,298	3,509	1,213	522	493	1,391
తంబళ్లపల్లె	12,552	4,362	3,065	1,585	1,528	828
మదనపల్లె	14,240	2,956	4,571	1,467	1,165	3,036



ప్రభుత్వం ఇచ్చే కిటికీలు

లబ్ధిదారులకు 17-1-23 నాటికి చెల్లించిన బిల్లులు

నియోజకవర్గం	నగదు చెల్లింపు	మెటీరియల్ విలువ	మొత్తం
రాయచోటి	రూ.99,67,46,773	రూ.14,47,52,759	రూ.114,15,09,532
పీలేరు	రూ.82,19,65,992	రూ.12,08,35,556	రూ.94,28,01,548
రాజంపేట	రూ.52,33,03,357	రూ.8,76,11,114	రూ.61,10,04,471
రైల్వేకోడూరు	రూ.36,08,35,789	రూ.6,60,68,071	రూ.42,69,03,860
తంబళ్లపల్లె	రూ.65,84,34,221	రూ.8,13,15,735	రూ.73,97,49,956
మదనపల్లె	రూ.99,00,60,896	రూ.14,73,36,001	రూ.113,73,96,897




మురిపించే బంతి.. చామంతి

'బంతి, చామంతి ముద్దాడుతున్నాయిలే' – అనే పాట వినే ఉంటారుగా! బంతి జాతి మొక్కే ఇదీనూ. వర్ష రుతువుకు వీడ్కోలు పలుకుతూ మొగ్గ తొడిగి, ముద్దు ముద్దుగా మురిపిస్తున్నాయి ఈ పుష్పాలు. శరదృతువు వెన్నెల్లో విరబూసి, హేమంతంలో మంచు బిందువులతో ఊసులాడుతూ కనువిందు చేస్తున్నాయి. ప్రకృతిని పరవశింప జేస్తున్నాయి. గులాబీల తర్వాత ఎక్కువ రంగులు, రకాలు ఉండటం ఈ పూల ప్రత్యేకం. ఇటు సుగంధాలను అటు ఆనందాలను పంచుతోంది. మనస్సుకు ఆహ్లాదాన్ని, ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ సుందర దృశ్యం కడప నగర సమీపంలోని సిద్దవటం మండలం మాచుపల్లె పొలాల్లో కనిపిస్తోంది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

కలువల కనువిందు




పెద్ద సాగునీటి ప్రాజెక్ట్ కాలువలో అరవిరిసిన పద్మాలను చూస్తుంటే మనసుకెంతో హాయి. మరి విచ్చుకున్న వేల తామరలు కాలువంతా కనువిందు చేస్తుంటే.. గులాబీ వన్నెలతో రారమ్మని ఆహ్వానిస్తుంటే.. ఆ దృశ్యం అపురూపం కదా! ఎర్రగుంట్ల మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు సమీపాన మేకలబాలయపల్లె, కే గోపులాపురం గ్రామాల మధ్య ఉన్న మైలవరం రిజర్వాయర్ దక్షిణ కాలువలో ఉంది. కనుచూపు మేర కనిపించే పూలసోయగాలు స్థానికులు, ప్రయాణికుల మదిని దోచుకుంటున్నాయి. వారు విరబూసిన కలువల అందాలను తమ కెమెరాలు, హృదయాల్లో పదిల పరుచుకుంటున్నారు.

– ఎర్రగుంట్ల

ఎస్‌సీఈఆర్టీ అసెస్‌మెంట్ సెల్‌కు ఎంపిక


గంగరాజు

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య శిక్షణ పరిశోధన సంస్థ అసెస్‌మెంట్‌కు(సాంఘిక శాస్త్రం) సెల్‌కు తొండూరు మండలం అగడూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పని చేసే సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గంగరాజు ఎంపికైయాడు. అసెస్మెంట్ సెల్‌లో డిప్యూటేషన్‌పై పని చేయుటకు ఎస్‌సీఈఆర్టీ వారు డిసెంబర్ 11న నిర్వహించిన పరీక్షల్లో ఆయన ప్రతిభను చాటాడు. ఆ తరువాత జనవరి 4న విజయవాడలో నిర్వహించిన ఇంటర్వ్యూలో కూడా తమ ప్రతిభను చాటి అసెస్మెంట్ సెల్‌కు ఎంపికైయాడు. ఈయన పరీక్షా పత్రాల మూల్యాంకనం, ఫలితాల సరళి వంటి విషయాలపై పరిశీలన చేస్తారు. ఎస్‌సీఈఆర్టీ అసెస్‌మెంట్ సెల్‌కు ఎంపికైన గంగరాజుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు అభినందనలు తెలిపారు.

ధ్వజ స్తంభ దీప కలశం మాయం

- ఏనుగుమల్లమ్మ ఆలయంలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- సీసీ కెమెరా వైర్లు కత్తిరించి.. తస్కరించిన దొంగలు


ఆలయం ఎదుట ధ్వజస్తంభంపై దీప కలశం (వృత్తంలో)


మాయమైన దీప కలశం, దానిపైన రాయి

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన మాహిమాన్విత ఏనుగు మల్లమ్మ ఆలయం ఎదుట ప్రతిష్టించిన అత్యంత పురాతనమైన ధ్వజస్తంభంపై ఉన్న దీప కలశం మాయమైంది. కొన్ని రోజుల క్రితం జరిగినట్టు భావిస్తున్న ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపై ఏనుగుమల్లమ్మ ఆలయం వెలసి 200 ఏళ్ల కంటే ఎక్కువగా ఉంటుందని కోటావూరు గ్రామస్తులు చెబుతున్నారు. ఏనుగుమల్లమ్మ కొలువైన అసలైన ఆలయం ప్రస్తుత ఆలయం వెనుక చెట్టు కింద ఇప్పటికీ ఉంది. వందేళ్ల క్రితం ఆలయాన్ని కొత్తగా నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటి నుంచి ప్రాచుర్యంలోకి వచ్చింది. మహిమలు కలిగిన ఆలయంగా ప్రాచుర్యం ఉండగా, ఏనుగుమల్లమ్మను కొలిచే భక్తుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో పురాతన ఆలయానికి ఎదురుగా అప్పట్లోనే దీప ధ్వజస్తంభాన్ని (ప్రస్తుతం కొత్త ఆలయం ఎదుట) ఏర్పాటు చేశారు. ఈ దీప ధ్వజస్తంభానికి ప్రత్యేకతలు ఉన్నాయి. దీప స్తంభంపై మెట్ల మాదిరిగా మూడు స్టేజీలను చెక్కారు. దానిపైన కళాత్మకంగా తయారు చేసిన దీప కలశాన్ని పెట్టి.. కలశంలో అతుక్కునేలా దీర్ఘ చతురస్రాకారంలోని బండరాయిని ఉంచారు. ఇలా పూర్తి స్థాయిలో ఉండాల్సిన ధ్వజస్తంభంపై దీప కలశం కనిపించడం లేదు. ఇది గుప్త నిధుల ముఠా పనై ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆలయం, దాని పరిసరాల చుట్టూ నిఘా ఉండేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దుండగులు వాటి వైర్లను కత్తిరించి పైకి ఎక్కి దీప కలశాన్ని కిందకు పడదోసి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. దీప కలశంలో గుప్త సంపద ఉంచారని, దానికోసమే దొంగలించారని భావిస్తున్నారు.

ఈ ఘటన కొన్ని రోజుల క్రితం జరిగి ఉండొచ్చని భావిస్తుండగా.. దొంగలకు స్థానికులు సహకరించారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయాన్ని అలయ ధర్మకర్తల దృష్టికి తీసుకెళ్లగా.. దీప కలశం చోరీకి గురికావడం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కొండపై ఇలాంటి ఘటన జరగడం ఇదే కావడంతో భక్తులు, స్థానికుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

గురుకుల పాఠశాలలో త్రీమెన్ కమిటీ విచారణ


గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న త్రీమెన్ కమిటీ

వాల్మీకిపురం : వాల్మీకిపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలతో నియమించిన త్రీమెన్ కమిటీ విచారణ చేపట్టింది. మంగళవారం ఉదయం మదనపల్లి ఆర్డీవో మురళి, అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ, అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కొండయ్య గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలకు సౌకర్యాల కల్పన, భోజనం, వైద్యా సేవలపై ఆరా తీశారు. నాలుగు రోజుల క్రితం ఈ పాఠశాలలో చోటు చేసుకున్న 9వ తరగతి బాలిక సంఘటనపై నియమించిన కమిటీ సుదీర్ఘ విచారణ చేపట్టింది. సుమారు 6 గంటలకు పైగా కమిటీ సభ్యులు రహస్య విచారణ చేపట్టారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థినులు, సిబ్బందిని విడివిడిగా విచారణ చేశారు. బాలిక సంఘటన, తదితర విషయాలపై చర్చించినట్లు తెలిసింది. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని విచారణ చేసి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. విచారణ అనంతరం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని, అనంతరం ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా పీడీ ధనలక్ష్మీ, రాష్ట్ర గురుకులాల సంస్థ కార్యదర్శి పవన్‌మూర్తి, సీడీపీవో భారతి, తహసీల్దారు ఫిరోజ్ ఖాన్, ఎస్‌ఐ బింధుమాధవి, డాక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ గుణశేఖర్, ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేటలో మహిళ హత్య


మృతి చెందిన సాకే కళావతి

రాజంపేట : మండల సరిహద్దు గ్రామమైన వెంకట రాజంపేట వద్ద వున్న పెట్రోలు బంకు సమీపంలో కడపకు చెందిన సాకే కళావతి (40) హత్యకు గురైంది. మంగళవారం డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రాజంపేట రూరల్ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ భక్తవత్సలం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాకే కళావతిది అనంతపురం జిల్లా కదిరి సమీపంలోని బత్రపల్లె. ఆమె ఒక కొడుకు, ఒక కూతురుతో కలిసి కడపలో జీవిస్తోంది. ఆమెతోపాటు రోజూ సాయంత్రం నలుగురు మహిళలు కలిసి కడప నుంచి బయలుదేరి కడప–రేణిగుంట జాతీయ రహదారి వెంట పుల్లంపేట, కోడూరు, శెట్టిగుంటలో అక్కడక్కడా ఒక్కొక్కరు దిగేస్తారు. ఈ క్రమంలో ఆమెను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి పడేసి వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. దీంతో హత్య కేసుగా నమోదు చేసినట్లు రూరల్ సీఐ పుల్లయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంబంధీకులకు అప్పగించారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అత్తింటి వేధింపులపై కె.నవనీత(26) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టుటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం శివాజీనగర్‌లో నివాసమున్న వెంకటరెడ్డి, చంద్రకళ కుమార్తె నవనీతను అనంతపురం జిల్లా తనకల్లు మండలం దూగేనిపల్లెకు చెందిన కొత్తచెరువు లక్ష్మినారాయణరెడ్డి, ఉమాదేవిల కుమారుడు కె.గౌతంరెడ్డితో 2020లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో నవనీతకు 500 గ్రాముల బంగారు, గౌతమ్‌రెడ్డికి 60 గ్రాముల బంగారుతోపాటు రూ.7 లక్షలు కట్నం ఇచ్చి వివాహం చేశారు. బెంగళూరు డీఆర్‌డీఓలో సీనియర్ టెక్నికల్ ఇంజనీర్‌గా పని చేసే గౌతమ్‌రెడ్డి తల్లిదండ్రులతో కలిసి బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో నివాసమున్నాడు. పెళ్లయిన నెల రోజుల నుంచి బాధితురాలు నవనీతకు వేధింపులు మొదలయ్యాయి. భర్త ఇతర అమ్మాయిలతో చాటింగ్ చేయడం, మద్యం సేవించడం అనుమానంతో భార్యను వేధిస్తూ గృహహింసకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు మదనపల్లెలోని తల్లి వద్ద ఉంటోంది. 2021లో తండ్రి కరోనా కారణంగా మృతి చెందడంతో ఉద్యోగ అనంతర ప్రయోజనాలు వచ్చాయి. అవి తనకు తెచ్చి ఇవ్వాలంటూ గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నవనీతను పలుమార్లు వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు నవనీత భర్త గౌతమ్‌రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులపై టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాయచోటి టౌన్ : అనుమానాస్పద స్థితిలో నాగేశ్వరావు (45) అనే వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు తెలియచేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం దెయ్యాల మొరవ సమీపంలో ముళ్ల పొదల మధ్య కుళ్లిన మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు గొర్లవాండ్లపల్లెకు చెందిన వాడని తెలిపారు. మృతుడి భార్య స్వగ్రామం వీరబల్లె మండలం కుమ్మరపల్లెకు భర్తపై గొడవపడి పుట్టింటికి వెళ్లింది. దీంతో వారం రోజుల క్రితం భార్య వద్దకు వెళ్లాడు. భార్యతో గొడవపడ్డాడు. అక్కడ భార్యతో గొడవపడిన తరువాత తీవ్ర మనస్థాపానికి గురియ్యాడు. నేరుగా శిబ్యాలకు వచ్చి తనతో పురుగుల నివారణ మందు తీసుకెళ్లి ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి అక్కడే తాగి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అలాగే వీరబల్లె పోలీస్ స్టేషన్‌లో భార్యపై గొడవపడిన సందర్భంగా కేసు నమోదు అయ్యిందని తెలిపారు. నాలుగైదు రోజుల నుంచి కనిపించడం లేదని వెతికామని బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చెక్క భజన కళాకారులకు అవార్డు ప్రదానం


శివ నంది అవార్డును అందుకుంటున్న ఆంజనేయులు, హనుమంతు

వీరబల్లి : మండలంలోని తాటిగుంటపల్లి గ్రామం దళితవాడకు చెందిన పుల్లయ్య కుమారులు ఆమూరి ఆంజనేయులు, హనుమంతుకు శివ నంది అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణా రాష్ట్రంలోని కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 21న సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఇందులో వారు తమ ప్రదర్శన చేపట్టారు. అక్కడి ప్రాంత ప్రజలను బాగా ఆకట్టుకోవడంతో కోదాడ ఎమ్మెల్యే పోలం మల్లయ్య యాదవ్ వీరికి శివనంది అవార్డును అందజేశారు.

నలుగురిపై కేసు నమోదు

రాయచోటి టౌన్ : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.తాసిద్ బాషా, టిపిస్టు వివేకానంద, యువరాజుపై నలుగురు దాడికి పాల్పడినట్లు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలు సుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, పల్లపు రమేష్, ముఖేష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ ఎస్‌ఎండీ రఫీ తెలిపారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి (40) కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది గ్రామానికి సమీపంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి కుటుబ సభ్యులు సమాచారం అందించారు. బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో వృద్ధుడి మృతి

మదనపల్లె : ఆర్టీసీ బస్సులో వస్తూ అనారోగ్యంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు మండలం అంకితోటపల్లెకు చెందిన తిమ్మన్న (80) అనారోగ్యం కారణంగా వైద్య చికిత్సలకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. బస్సు మదనపల్లె ఆర్టీసీ బస్టాండుకు చేరుకోగా వృద్ధుడు కిందకు దిగకపోవడంతో మృతి చెందినట్లు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపి ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు.

నిందితుడికి జైలు శిక్ష

చిన్నమండెం : మండల కేంద్రంలోని వీఆర్ జ్యువెలరీ దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడైన రాజేష్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.400 జరిమానా విధిస్తూ రాయచోటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తీర్పునిచ్చినట్లు రాయచోటి రూరల్ సీఐ లింగప్ప తెలిపారు. 2022 జులై 14న చిన్నమండెంలోని వీఆర్ బంగారు దుకాణంలో రాత్రి సమయంలో రాజేష్ ప్రవేశించి సుమారు రూ.30 లక్షల విలువైన ఆభరణాలు చోరీ చేసినట్లు రుజువైంది. ఈ కేసులో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు బంగారు రికవరీ చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ వేయగా మంగళవారం జడ్జి నిందితుడికి జైలుశిక్ష విధించారు.

సైన్స్ ఒలంపియాడ్‌లో గోల్డ్‌మెడల్


శ్రీవల్లి


పూర్విక

పులివెందుల : సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సౌఫ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలంపియాడ్ విభాగంలో పులివెందులకు చెందిన విద్యార్థులు వంగల శ్రీవల్లి, తమ్మిశెట్టి పూర్వికలు గోల్డ్ మెడల్స్ సాధించారు. పట్టణంలోని స్వామి వివేకానంద పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న వీరు ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ విభాగంలో జరిగిన పరీక్షలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో ద్వితీయన స్థానం సాధించి గోల్డ్ మెడల్‌తోపాటు సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ద్వారా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

నిందితురాలిని అరెస్ట్ చేయాలి

రాయచోటి అర్బన్ : నాగేశ్వరి అనే మహిళ ఆత్మహత్యకు కారకురాలైన లక్ష్మిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఆయన బాధిత కుటుంబీకులతో కలసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లెకు చెందిన భార్యభర్తలైన నారకట్ల మునిరాజ, నాగేశ్వరి కూలీ పనులు చేసుకుంటూ జీవించే వారన్నారు. నాగేశ్వరి తల్లిదండ్రులు కరోనాతో చనిపోవడంతో నాగేశ్వరికి ప్రభుత్వ సహాయం అందిందన్నారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ముత్యాల నరసింహులు నాగేశ్వరి, మునిరాజ దంపతుల వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని ఎన్ని పర్యాయాలు అడిగినా ఇవ్వడం లేదన్నారు. బాకీ తిరిగి ఇవ్వమని అడగడాన్ని నరసింహులు భార్య లక్ష్మి సహించలేక నాగేశ్వరిని తన ఇంటికి పిలిపించుకుని తీవ్రంగా దూషించడంతోపాటు చెప్పుతో కొట్టి అవమాన పరిచిందన్నారు. మనస్థాపం చెందిన నాగేశ్వరి జనవరి 9వ తేదిన తన ఇంట్లోనే ఉరివేసుకుని చనిపోయిందన్నారు. సంఘటనపై నాగేశ్వరి భర్త కె.వి.పల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నిందితురాలిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదంటూ ఆరోపించారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రెడ్డెయ్య, బీటీఏ రాష్ట్రప్రచార కార్యదర్శి పల్లం రామచంద్రతో మృతురాలి కుటుంబీకులు, బంధువులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్


దుంగలు, నిందితులతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

రైల్వేకోడూరు : మండలంలోని వాగేటికోన సమీపంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సబ్ కంట్రోల్ కృపానంద తెలిపారు. స్థానిక టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని వాగేటికోన సమీపంలోని గుంజన సెక్షన్, బీట్ పరిధిలో బిల్లుపాటిపల్లి సమీపంలో అరటితోట వద్ద కొందరు అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడున్న ఆరు ఎర్రచందనం దుంగలను, ఒక మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరాజుపేటకు చెందిన మొగలి సుబ్రమణ్యం, బత్తల వినయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సీఐ బాలక్రిష్ణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు వివరించారు.

ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

17 పతకాలు కైవసం


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్.బాషామోహిద్దీన్

కడప స్పోర్ట్స్: ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించిన 66వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో 17 పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ అభినందించారు. చక్కటి శిక్షణ ఇచ్చిన అథ్లెటిక్స్ శిక్షకులు కె. వంశీధర్, పి.వెంకటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఖేలోఇండియా స్టేట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మేనేజర్ కె. శ్రీనివాస సింగ్ తదితరులు పాల్గొన్నారు.